# ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతన వేతలు

- 10వ తేదీ దాటినా అందని జీతాలు
- ఔట్ సోర్సింగ్ విభాగంలో కార్మికులకు తప్పని కష్టాలు

వరంగల్, మార్చి 13: వరంగల్ మహానగరపాలక సంస్థ ఔట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల వేతన వేతలు తీరడం లేదు. ప్రతి నెలా 5వ తేదీలోగా కార్మికులకు వేతనాలు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట నిలుపుకోవడం లేదు. 10వ తేదీ దాటినా వేతనాలు అందడం లేదు. దీంతో బల్దియాలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న సుమారు 3 వేల మంది కార్మికులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. తామే మీ చేయలేమని బల్దియా అధికారులు చేతులెత్తేస్తుండడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధికారుల మాటలు చూస్తుంటే మరో వారం రోజులపాటు వేతనాలు అందే కనిపించడం లేదని కార్మికులు వాపోతున్నారు.

**ట్రెజరీలో క్లియర్ అయితేనే జీతాలు**

బల్దియాలో ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు రాష్ట్ర ట్రెజరీలో క్లియర్ కావాల్సి ఉంది. మూడు వేల మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంబంధించిన వేతన చెక్కు 1వ తేదీన ట్రెజరీకి పంపించామని బల్దియా అధికారులు చెబుతున్నారు. అక్కడ క్లియరెన్స్ కావాల్సి ఉందని అంటున్నారు. ఇటీవల కార్పొరేషన్‌కు రావాల్సిన స్టాంప్ డ్యూటీకి సంబంధించిన రూ. 173 కోట్లు విడుదలయ్యాయి. వాటిలో నుంచి కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు మాత్రమే చెల్లించాలని స్పష్టంగా ఉంది. డబ్బులు ఉన్నా రాష్ట్ర ట్రెజరీ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో కార్మికులు పది రోజులుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

**కమిషనర్ చొరవ తీసుకోవాలి**

ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాల చెల్లింపుపై కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. లేఖలు రాసి చేతులు దులుపుకోవడం సరికాదని పేర్కొంటున్నారు. వేల మంది కార్మికుల వేతనాలకు సంబంధించిన అంశంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని నాయకులు కోరుతున్నారు.

# లైంగిక దాడికి యత్నించిన ఒకరి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చెన్నారావుపేట, మార్చి 13: వితంతువుపై లైంగిక దాడికి యత్నించిన ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు నెక్కొండ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వితంతువుపై అదే గ్రామానికి చెందిన విలేకరి, పాస్టర్ ఆకుల అశోక్ బుధవారం లైంగిక దాడికి యత్నించాడు. మనస్తాపం చెందిన ఆమె నిద్ర మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి అశోక్‌ను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సై రాజేశ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతరాయాలు లేకుండా చూడాలి: ఎస్ఈ


బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ గౌతమ్‌రెడ్డి

వర్ధన్నపేట, మార్చి 13: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎస్ఐ గౌతమ్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఉప్పరపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. వరి పంటతోపాటు ఇతర వాణిజ్య పంటలు కూడా పూత, కాత దశలో ఉన్నాయన్నారు. ఈ సమయంలో పంటలకు నీరు అవసరం ఉంటుందని, అధికారులు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వరంగల్ రూరల్ డీఈ భిక్షపతి, ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


వెంకట్రాములు

పోచమ్మమైదాన్, మార్చి 13: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికాదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. స్ట్రైచర్, మార్చురీ మాటలు అనడం ఆయన అసహనాన్ని ప్రతిబింబిస్తుందని విమర్శించారు. రాజకీయ విధానాలపై విమర్శలు ఉండాలే తప్ప వ్యక్తిగత విమర్శలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. ఇలాంటి దూషణలు ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిదికాదని హితవు పలికారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**కమర్షియల్ స్పేస్‌లు అమ్మకం**

★ హనుమకొండలో కిరాయిలు వచ్చు 1650, 2500, 6000 Sft. కమర్షియల్ స్పేస్‌లు తక్కువకు అమ్మకానికి కలవు. వెంటనే సంప్ర: సెల్: 9348199922.

NTW-332339

**PLOT FOR SALE**



★ జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.

NT-330714

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## 'అభయహస్తం పథకానికి నిధులు కేటాయించాలి'

వరంగల్‌చౌరస్తా, మార్చి 13: అంబేద్కర్ అభయహస్తం పథకానికి 2025–26 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంఘి ఎలేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేస్తామని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు ఇస్తామని, ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకూ ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఈ నెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ సమావేశాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.

### కొమ్మాల జాతర కార్యవర్గం



గీసుగొండ, మార్చి 13: కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కొమ్మాల గ్రామానికి చెందిన కడారి రాజు ఎన్నికయ్యారు. అలాగే, సభ్యులుగా లా వుద్యా రాజన్న, కోలా వేణు, కేలోత్ జైత్రం, మర్రి రాజలింగం, భూక్యా రాంబాబు, వాంకుడోత్ సేవ్యులా, లాడె రాజేశ్వర్‌రావు, మండల నరేశ్, ఇమ్మడి సమ్మయ్య, బోయపాటి శ్రీదేవి, యార రాజయ్య, నాగపురి సుమలత ఎన్నికయ్యారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు వారికితో ప్రమాణం చేయించారు.

### బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయపర్తి, మార్చి 13: కొండాపురంలోని రుక్మిణీ సత్యభామ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం అధ్యయన బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పలు కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి.


పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న సేవకులు

# మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

- జోరుగా బెల్టు షాపులు, గుడుంబా కేంద్రాల నిర్వహణ
- ఏరులై పారుతున్న మద్యం, గుడుంబా


రాయపర్తి తండాలో తయారవుతున్న గుడుంబా

వర్ధన్నపేట, మార్చి 13: ఎక్సైజ్ అధికారులు మామూళ్లకు అలవాటు పడడంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు, గుడుంబా కేంద్రాలు దర్శనమిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. నిరుపేద కుటుంబాలను విచ్చిన్నం చేస్తున్న బెల్టు షాపులు, గుడుంబా కేంద్రాలను కట్టడి చేయాల్సిన అధికారులే నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వైన్ షాపుల కంటే బెల్టు షాపుల్లోనే పెద్ద మొత్తంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో క్వార్టర్ మద్యం బాటిల్‌పై బెల్టు షాపుల నిర్వాహకులు రూ. 20 అధికంగా వసూలు చేస్తున్నారు. అలాగే, వర్ధన్నపేట పట్టణ సమీపంలోని తండాలతోపాటు రాయపర్తి మండలంలోని తండాల్లో జోరుగా గుడుంబా తయారు చేస్తున్నారు. అధికారులు మాముళ్లకు అలవాటుపడి ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో గుడుంబా ఏరులై పారుతున్నదని తండావాసులు వాపోతున్నారు. వర్ధన్నపేట మండలంలోని ఐదు వైన్స్‌ల నిర్వాహకులు బెల్టు షాపులకు నేరుగా మద్యాన్ని విక్రయించకుండా కేవలం దుకాణాల్లో మాత్రమే అమ్ముతున్నారు. గతంలో మద్యం షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యం దుకాణాలకు తీసుకెళ్లి అమ్ముకునేవారు. దీంతో ఎక్సైజ్ అధికారులకు నెలవారీగా పెద్దమొత్తంలో నగదు ముట్టజెప్పేవారు. కానీ, ఇప్పుడు బెల్టు షాపులకు మద్యం అందించకపోవడంతో నెలకు రూ. 15 వేల వరకు మాత్రమే అందిస్తున్నట్లు తెలుస్తున్నది. కానీ, రాయపర్తి మండలంలో బెల్టు షాపులకు మద్యం దుకాణాదారులు నేరుగా అమ్ముతుండడంతో నెలకు రూ. 40 వేల వరకు షాపు వారీగా అధికారులకు మాముళ్లు ముట్టజెప్పుతున్నట్లు సమాచారం. వర్ధన్నపేట మండలంలో తక్కువ మొత్తంలో రాబడి ఉండడంతో ఎక్సైజ్ అధికారులే నేరుగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపుల నుంచి నెలవారీగా వసూళ్ల కోసం ఇద్దరు జవాన్లు ప్రత్యేకంగా పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహన డ్రైవర్‌తోపాటు మరో జవాన్ నెలవారీగా బెల్టు షాపుల వద్దకు వెళ్లి ఒక్కో బెల్టు షాపు వద్ద రూ. 2 వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. డబ్బులు ఇవ్వకుంటే మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.


విజయవాడ కోర్టు వద్ద ఎర్రబెల్లి దయాకర్‌రావు

## ఓబులాపురం గనుల కేసులో ఎర్రబెల్లికి ఊరట

దేవరుప్పుల, మార్చి 13 : ఓబులాపురం గనుల పరిశీలనకు వెళ్లిన అప్పటి టీడీపీ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, అచ్చెన్నాయుడు, దేవినేని ఉమ, నాగం జనార్దన్‌రెడ్డిపై 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసు నమోదైంది. ఇన్నాళ్లూ కొనసాగిన ఈ కేసును విజయవాడ కోర్టు కొట్టివేసింది. విజయవాడ కోర్టుకు గురువారం హాజరైన వీరికి న్యాయమూర్తి కేసును కొట్టేస్తున్నట్లు తీర్పు ఇవ్వడంతో ఊరట లభించింది. కాగా, ఈ కేసులో టీడీపీ నాయకులు చినరాజప్ప, అమర్నాథరెడ్డి, వీబీ రాజేంద్రప్రసాద్, గురుమూర్తి, వేం నరేందర్‌రెడ్డి ఉండగా, వీరంతా విజయవాడ కోర్టుకు హాజరయ్యారు.

## 'వేసవిలో ఒకపూట నిర్వహించాలి'

నర్సంపేట, మార్చి 13: ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా వేసవిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఒకపూట నిర్వహించి, మే నెలలో సెలవులు ప్రకటించి టీహెచ్‌ఆర్‌కు అనుమతి ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతిరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆమె మహిళా అభివృద్ధి స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రాంచంద్రన్, కమిషనర్ కాంతి వెస్లీని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏటా మే నెలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు 15 రోజులు సెలవు ఇవ్వాలని కోరారు.

## పోలీసుల అదుపులో నిందితులు

కరీమాబాద్, మార్చి 13: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ బాలిక కిడ్నాప్‌కు గురైన విషయం తెలిసిందే. గురువారం పోలీసులు బాలికను కాపాడి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న యువతి గతంలోనూ పలు నేరాల్లో నిందితురాలిగా ఉన్నట్లు తెలుస్తున్నది. యువతిని విచారిస్తున్నట్లు తెలిసింది.

## మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

నర్సంపేట, మార్చి 13: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా రెండు రోజులు సెలవు ఇస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం హోలీ, శనివారం అడ్తి వ్యాపారుల కోరిక మేరకు సెలువు ఇస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## సఖీ సేవలపై అవగాహన పెంచుకోవాలి

నెక్కొండ, మార్చి 13: సఖీ సేవలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సఖీ సెంటర్ లీగల్ కౌన్సెలర్ శోభారాణి సూచించారు. సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గుండ్రపల్లి, అలంకానిపేటలో సఖీ సెంటర్ సేవలపై గురువారం మహిళలకు అవగాహన కల్పించారు. సఖీ సెంటర్ 24 గంటలూ పని చేస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు 181కు కాల్ చేయాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ హరీశ్‌రెడ్డి

## విద్యుత్ అధికారుల సమావేశం

నెక్కొండ, మార్చి 13: నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో ప్రమాదాలకు కారణమవుతున్న 11కేవీ విద్యుత్ లైన్ మార్పుపై మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏడీఈ శ్రీధర్, ఏఈ చిరంజీవి, మార్కెట్ కమిటీ కార్యదర్శి కృష్ణమోహన్‌రావు కలిసి 11 కేవీ లైన్ షిఫ్టింగ్ స్థలాలను పరిశీలించి, ఓ నిర్ణయానికి వచ్చారు. నెక్కొండలో నాలుగు ఓవర్ లోడ్ డీటీఆర్‌లు ఏర్పాటు చేశామని, మరో మూడు ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టామన్నారు.

# నగరంలో మొక్కలు ఎండుతున్నాయ్


కేయూ ప్రధాన రహదారిలోని సెంట్రల్ మీడియంలో ఎండిపోయిన చెట్లు

వరంగల్, మార్చి 13: సుందరీకరణలో భాగంగా నగర ప్రధాన రహదారుల్లోని సెంట్రల్ మీడియంలో నాటి మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. అయితే, బల్దియా ఉద్యాన విభాగం మొక్కల నిర్వహణను గాలికొదిలిసింది. ప్రతి రోజు ఉదయం సెంట్రల్ మీడియంలోని మొక్కలకు నీళ్లు పట్టాల్సిన బల్దియా హార్టికల్చర్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వేసవి ప్రారంభంలోనే మొక్కలు ఎండిపోతున్నాయి. నిత్యం నగరంలో పర్యటిస్తున్న కమిషనర్‌కు ఎండిన మొక్కలు కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాకతీయ యూనివర్సిటీ నుంచి భీమారం వెళ్లే ప్రధాన రహదారిలోని సెంట్రల్ మీడియంలో మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో నగర ప్రజలు బల్దియా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## 'వర్గీకరణ తర్వాతే ఉద్యోగ ఫలితాలు వెల్లడించాలి'


వరంగల్: మాట్లాడుతున్న కట్ల రాజశేఖర్


వరంగల్/నర్సంపేట/రాయపర్తి, మార్చి 13: ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. బల్దియా కార్యాలయం ఎదుట ఆయన దీక్షలను ప్రారంభించారు. అలాగే, నర్సంపేటలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, రాయపర్తిలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికట్ల విజయ్‌కుమార్ ప్రారంభించారు.

## మానవ అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై నరేశ్

సంగెం, మార్చి 13: మానవ అక్రమ రవాణాపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్ సూచించారు. మండలకేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మన చుట్టూ ఉండే వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతను టార్గెట్ చేస్తున్నారని, వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షుడు కల్యాణి, కార్యదర్శి రాజమణి, ఎంపీఎం కిషన్, సీసీలు కుమారస్వామి, రాజయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## గ్రూప్ 2లో ర్యాంక్‌లు సాధించిన వారికి సన్మానం


ర్యాంకర్లను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

వరంగల్, మార్చి 13: గ్రూప్ 2 ఫలితాల్లో ర్యాంకులు సాధించిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న వాసిరెడ్డి రమ్య టీజీపీఎస్సీ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఆమెకు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బిల్లా శ్రావణి గ్రూప్ 2 ఫలితాల్లో స్టేట్ 10వ ర్యాంక్ సాధించారు. మహిళా కేటగిరీలో స్టేట్ 6వ ర్యాంక్ సాధించారు. వీరిని తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.


వాహనంలో ఎక్కిస్తున్న ఎస్సై మహేందర్

## ఒకరికి పాము కాటు

### పోలీస్ వాహనంలో తరలింపు

నెక్కొండ, మార్చి 13: మండలంలోని బొల్లికొండకు చెందిన బానోత్ బాలాజీకి గురువారం పాము కాటు వేసింది. 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఎస్సై మహేందర్ పోలీస్ వాహనంలో చికిత్స కోసం అతడిని నర్సంపేటలోని ఏరియా దవాఖానకు తరలించారు.

## వినియోగదారుల సంక్షేమ మండలి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రవీణ్



కాశీబుగ్గ, మార్చి 13: వరంగల్ 18వ డివిజన్ ప్రతాప్‌నగర్ కాలనీకి చెందిన చిలువేరి ప్రవీణ్‌ను వినియోగదారుల సంక్షేమ మండలి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినట్లు జాతీయ చైర్మన్ విఖ్యాత్ షేనాయ్ తెలిపారు. ఈ మేరకు గురువారం జాతీయ ప్రిన్సిపల్ జనరల్ సెక్రటరీ దేవేంద్ర తివారీ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, పల్లెపాడు దామోదర్, మొగిలిచెర్ల సుదర్శన్‌కు ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# టైరు పేలి కారు బోల్తా ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- దశదినకర్మకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఖానాపురం, మార్చి 13 : ప్రమాదవశాత్తు టైరు పేలి కారు బోల్తా పడి ఇద్దరు మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలం ఐనపల్లి శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం జరిగింది. ఎస్సై సీహెచ్ రఘుపతి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖిలావరంగల్‌కు చెందిన ఏసిరెడ్డి యశోద (80), బొలుగొడ్డు మాణిక్యమ్మ (78) అక్కాచెల్లెళ్లు. వీరు మరో ముగ్గురితో కలిసి కారులో మహబూబాబాద్ జిల్లా కురవిలో తమ సమీప బంధువు దశదిన కర్మకు వెళ్లారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి వస్తుండగా ఐనపల్లి శివారులోకి రాగానే అకస్మాత్తుగా వెనుక టైరు పేలడంతో కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి అక్కడే ఉన్న గోడకు తగిలింది. ఈ ప్రమాదంలో యశోద, మాణిక్యమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కారు నడుపుతున్న రమేశ్, కారులో ఉన్న హరీశ్, అనితకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రఘుపతి ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో నర్సంపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే యశోద, మాణిక్యమ్మ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యశోదకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మాణిక్యమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అక్క, చెల్లెలు మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.


యశోద, మాణిక్యమ్మ(ఫైల్)


ఐనపల్లి శివారులో బోల్తాపడిన కారు


ఉద్యమకారులను సన్మానించిన నిర్వాహకులు

## ఘనంగా ఎమ్మెల్సీ కవిత బర్త్‌డే వేడుకలు

పోచమ్మమైదాన్/కాశీబుగ్గ, మార్చి 13: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు వేడుకలను పోచమ్మమైదాన్ సెంటర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వద్దిరాజు రవిచంద్ర యువసేన, జాగృతి సభ్యుల ఆధ్వర్యంలో కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ కేక్ కట్ చేసి, 300 మందికి ఆలు బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర నాయకులు రాణి, సందీప్, నాగపూరి రమేశ్, బబ్లూ, సిరిమల్ల కిరణ్, సామల అజయ్‌కుమార్, పసునూటి సుమన్‌కుమార్, శ్రీనివాస్, రాజు, మాజ్, రబ్బాని, సురేశ్, నరేశ్ పాల్గొన్నారు. అలాగే, కాశీబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వర రంగనాథస్వామి ఆలయం ఎదుట కవిత బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలకు చీరెలు పంపిణీ చేసి, జాగృతి మహిళా నాయకురాలు నూకల రాణి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే, తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యాస్వామి, తాళ్ల ఉమ, నాయకులు ముష్కె ప్రమీల, పెండ్యాల సోనుబాబు, ఇక్బాల్, సుభాన్, పప్పుల మంజుల, కూచన రాహుల్, గనిపాక చరణ్, లక్క ధనలక్ష్మి, ముసిపట్ల శ్రీదేవి పాల్గొన్నారు.


ఎల్‌బీనగర్‌లో విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను కలుస్తున్న ఉపాధ్యాయుడు హరిప్రసాద్

## పిల్లలు.. ఎలా చదువుతున్నారు?

### విద్యార్థుల ఇంటికి వెళ్లి స్టడీపై ఆరా తీస్తున్న ఉపాధ్యాయుడు

పోచమ్మమైదాన్, మార్చి 13: పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఓ ఉపాధ్యాయుడు వినూత్నంగా విద్యార్థుల ఇండ్లకు వెళ్లి ఎలా చదువుతున్నారో తెలుసుకుంటున్నాడు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి పాఠశాల హిందీ పండిట్ హరిప్రసాద్ రోజూ రాత్రి వేళల్లో విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు కష్టపడి చదివేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. బయట తిరగకుండా, సెల్‌ఫోన్లు, టీవీల జోలికి వెళ్లొద్దని పిల్లలకు సూచించారు.


మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న సభ్యులు

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

కరీమాబాద్, మార్చి 13: శాలివాహన కుమ్మర డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ రంగశాయిపేట, శంభునిపేట ఆధ్వర్యంలో గురువారం శంభునిపేటలో తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆవునూరి రవి, ప్రధాన కార్యదర్శి కందికొండ మోహన్, కోశాధికారులు ఆవునూరి కుమారస్వామి, ఆకారపు భిక్షపతి, సలహాదారులు దేవేందర్, రాంబాబు, కార్యవర్గ సభ్యులు రాజేశ్, శ్రీను, విష్ణు పాల్గొన్నారు. అలాగే, ఉర్సులో కుమ్మర సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.


రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

## కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ, మార్చి 13: ప్రజలు కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎన్ఎస్ఆర్ రీచ్ అపోలో వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సూచించారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని ఎన్ఎస్ఆర్ ఆసుపత్రిలో గురువారం ఉచితంగా మూత్రపిండాల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి, మూత్రపిండాల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కోదండరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## 'చార్జీలు మార్కెట్ కమిటీ చెల్లించాలి'

కాశీబుగ్గ, మార్చి 13: మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులను తూకం వేస్తున్న దడువాయిల చార్జీలను మార్కెట్ కమిటీ చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల నుంచి అనేక రకాల చార్జీలు వసూలు చేయడంతో అధిక భారం పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

### స్కూల్‌కు ఫ్యాన్ల బహూకరణ

పర్వతగిరి, మార్చి 13: రోళ్లకల్‌లోని ఆర్డీఎఫ్ పాఠశాలకు విద్యా కమిటీ చైర్మన్ కందకట్ల ప్రకాశ్ సీలింగ్ ఫ్యాన్లు బహూకరించినట్లు హెచ్‌ఎం రాములు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెచ్‌ఎం రమేశ్, పీఎస్ ఇన్‌చార్జి బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 18కిలోల గంజాయి పట్టివేత

వరంగల్ చౌరస్తా, మార్చి 13: వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని నుంచి 18 కిలోల గంజాయి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన షేక్ సాదికా, షేక్ మక్సుద్ నుంచి రూ. 9 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ సుక్రూ తెలిపారు.